# కోట బురుజులు తలలువంచాయి

**కో**ట బురుజుల వంక చూస్తోంది మల్లమ్మదేవి. ఎత్తైన ఆ కోట గత చరిత్రకి గర్వపడుతూ తలెత్తుకు నించున్నట్లనిపించింది మల్లమ్మ మనసుకి. ఈ బొబ్బిలి కోట బుస్సీ కుట్రకి తలొగ్గుతుందా? విజయరామరాజు దురాలోచనకి చేయి కలుపుతుందా! ఈ కోట రాజమల్లమ్మ పసుపు కుంకుమలు తుడుస్తుందా! ఈ కోట ఆ కుట్రదారునికి వశమై బొబ్బిలికే తలవంపులు తెస్తుందా!

ఉదయ సంధ్యారాగంతో మల్లమ్మ నుదుటి కుంకుమ మెరిసింది. కాలి మంజీరాలు ఘల్లుమన్నాయి. చేతి కంకణాల గలగల ధ్వనులు గుండెలో ప్రతిధ్వనించాయి. ఈ ఫ్రెంచి సేనాని బుస్సీ, విజయరామరాజుకు తోడై కోటలో అడుగుపెడితే – ఆ ఆలోచన మల్లమ్మ కళ్ళల్లో మంటలు రేపింది. మల్లమ్మ రక్తం పొంగింది. ఈ సమయంలో రాజకీయపుటెత్తుల్లో తనకేమీ సంబంధం లేదా? తను కేవలం స్త్రీ మాత్రమేనా? తను కాళికాదేవిగా మారితే…?.....రాజమల్లమ్మ పెదాలపై చిరునవ్వు విరయబూసింది.

'కుట్రలు తెలుసుకోవటం ఎంత కష్టం' అనుకుంటూ మల్లమ్మ అంతఃపురంలో కొచ్చింది. ఈ వంశాన్ని తను రక్షించలేదా! ఆఖరికి ఈ వంశాంకురాన్ని రక్షించగలిగితే! రాణి మల్లమ్మ అటు ఇటు తిరిగింది. మనసు రకరకాల ఆలోచనలతో పరుగు తీసింది. క్షణంలో మనసులో మెరుపు మెరిసింది. అంతఃపురం గవాక్షంలో వెలుతురు లోపలకొచ్చి పడింది. రాణి మల్లమ్మ గుండె దిటవు చేసుకుంది – అంత సాహసం! ఎంత సాహసం!!

పెద్దదాసి వెంకటలక్ష్మి వచ్చి నిలబడింది. ఈ దాసీ ఈ పని చేయగలదా! భయపడి పారిపోతుందా! రాణి మల్లమ్మ దాసీ వైపు చూస్తూ, "వెంకటలక్ష్మి వింటున్నావా" అంది.

దాసి వంచిన తల ఎత్త లేదు.

"ఏమిటీ" అంది మల్లమ్మ మరోసారి.

దాసి వెంకటలక్ష్మి కన్నీళ్ళు ఆగకుండా రాణి మల్లమ్మ పాదాలపై పడ్డాయి రాణిపాదాలు పట్టుకుని వెంకటలక్ష్మి వెక్కి వెక్కి ఏడిచింది.

"అమ్మా, నేను బతికుండి ఈ మాట వినాల్సి వస్తుందనుకోలేదమ్మా! అమ్మా ఆ బుస్సీ దొర, ఆ విజయరామరాజు, మన కోటలో ప్రవేశించి మనందర్నీ – అమ్మా నా నోటితో చెప్పలేనమ్మా" – వెంకటలక్ష్మి మళ్ళీ ఏడ్వటం మొదలుపెట్టింది.

"ఈ కోట వాళ్ళు ముట్టడిస్తే మనం చూస్తూ ఊరుకుంటామా" అంది రాణి మల్లమ్మ.

"ఏం చేస్తామమ్మా, వాళ్ళు దుర్మార్గులు, మనం ఆడోళ్ళం" - వెంకటలక్ష్మి ఏదో అనబోయింది.

"మనం ఆడవాళ్ళమే, కానీ లక్ష్మీ మనం దుర్గాదేవి లాంటి వాళ్ళం తెలుసా?" ఆ మాట రాణి అంటుంటే పసికూన వంశోద్ధారకుడు ఏడుపు వినిపించింది మల్లమ్మ చెవికి.

ఒక్కక్షణం ముఖం వివర్ణమయింది. ఈ పసివాడు ఒక్కడూ మిగిలినా చాలు కదా! రాణి మల్లమ్మ దీర్ఘంగా నిట్టూర్చింది. వెంకటలక్ష్మి కన్నీళ్ళు తుడుచుకుంది.

'వంశోద్ధారకుణ్ణి రక్షించుకోవాలి' - రాణి మల్లమ్మ మాతృహృదయం ఒక్కసారి తల్లడిల్లిపోయింది. తను మాతృమూర్తి మాత్రమే కాదు - తను రాజ్యంలో వున్న ప్రతి స్త్రీకి తల్లే! స్త్రీల అందరి మానప్రాణాలు రక్షించాలి- తను రక్షించగలదా! రాణీ మల్లమ్మ గుప్పెళ్ళు బిగిసాయి.

వెంకటలక్ష్మి పసివాణ్ణి ఒళ్ళో పెట్టుకుంది. ఇలాంటి పరిస్థితుల్లోనే స్త్రీల ధైర్యసాహసాలు, ఆత్మవిశ్వాసం నిలబడాలి అనుకుంటూ మల్లమాంబ పసివాణ్ణి ఒళ్ళోకి తీసుకుంది. భవిష్యత్ సామ్రాజ్యాధినేత అమ్మ ఒడిలో ఒదిగి ఆడుకుంటున్నాడు. దాసి కూచుని ఎదురుగా కనిపిస్తున్న కోట కేసి చూస్తున్నది, 'ఈ బొబ్బిలి వారి ఋణం తనెలా తీర్చుకోగలను ఈ పసివాణ్ణి ఎలా రక్షించగలను' అనుకుంటూ చెక్కిట చేయి పెట్టుకుని ఆవేదనలో మునిగిపోయింది.

రాణి మల్లమ్మదేవి ఆ కోట బురుజులు చూస్తూ-

'విజయరామరాజు కుట్ర తెలియని బొబ్బిలి వారు పెండిండ్ల మహోత్సవంలో మునిగి వున్నారు. ఈ పసుపు బట్టలారని ఈ పెళ్ళికూతుళ్ళంతా ఈ కోట నుండి ఎలా బయటపడతారు? ఎవరూ వార్ని దోచుకోకుండా ఏ శక్తి కాపాడుతుందో" - మల్లమ్మ కి ఆలోచిస్తున్న కొద్దీ ఆవేశం పెరిగిపోయింది.

"వెంకటలక్ష్మి"

"అమ్మా"

వెంకటలక్ష్మి రాణిగారి చెంతకే చేరింది. 'ఇలారా' రాణి పిలుపు మేరకు. లోపల అభ్యంతర మందిరంలోకి నడిచింది వెంకటలక్ష్మి.

"ఈ పని చేయగలవా?" - ఆ మాట అంటుంటే రాణి గొంతు వణికింది.

"వెంకటలక్ష్మి భయపడి నా బిడ్డని వదిలేయకూడదు"

"అమ్మా ఎంత మాట?"

"ఈ వంశాకురమే పెరిగి మహా పౌరుష వ్యక్తియై మళ్ళా తలెత్తి నిలబడాలి" - వెంకటలక్ష్మి చేతిలో వున్న వెంకటరాయని శిరస్సును ముద్దాడింది. గుండెలకి హత్తుకుంది.

వెంకటలక్ష్మికి ముచ్చెమటలు పోసాయి. తను ధైర్యంగా ఆ పని చేయగలదా! చేయలేకపోతే, అమ్మో! ఈ పసికూన బొబ్బిలి ముట్టడికి బలి కాకూడదు. తన గొంతులో ప్రాణముండగా ఇది జరగదు! వెంకటలక్ష్మి రాణి వంక ధైర్యంగా చూసి, "చెప్పండమ్మా, ఎంత కఠినమైన పనైనా చేస్తాను. ఈ బొబ్బిలి యుద్ధానికి ఈ పసివాడిని బలికానీయను. చెప్పండి" అంది ఆదుర్దాగా.

రాణి మల్లమ్మ దీర్ఘంగా నిట్టూర్చి - "శ్రద్ధగా విను, కోట ముట్టడించటానికి లోపల కొస్తారంతా...అప్పుడే నువ్వు పిల్లాడితో కోటలోంచి బయటికి పోవాలి".

"అమ్మా, అప్పుడా?" అంది భయంగా వెంకటలక్ష్మి - "ఆ సిపాయిలు నా వెంటపడి ఈ పసివాణ్ణి. అమ్మా నా ధైర్యం సన్నగిల్లుతోంది" - వెంకటలక్ష్మి కళ్ళలో భయం నిండుతోంది.

"సామర్లకోట చెల్లెలి దగ్గర దింపు పెంచమని చెప్పు. దాచమని చెప్పు"- రాణి గొంతు తగ్గించి రహస్యం చెప్పింది.

"కానీ...అమ్మా నేను, కోట ఎలా దాటి బయటపడతాను. ఈ పసివాడి ప్రాణాల్ని ఎలా.."

రాణి మల్లమ్మ ముసిముసిగా నవ్వింది. "ఈ వరహాల మూట నాకియ్యకపోతే బాబుని కాపాడననుకుంటున్నారా- ఈ వెంకటలక్ష్మి గొంతులో ప్రాణముండగా బాబుకి ఆపద రానిస్తానా - అమ్మా, ఈ బొబ్బిలి కోట రాణిగారిగా మీకెంత గౌరవమో దాసిగా నాకూ అంతేనమ్మా - ఈ పసికూనని రక్షించి కానీ నేను మళ్లా బొబ్బిలి కోటలో కాలు పెట్టను నా మాట వినండి, ఈవరహాల మూట నాకొద్దు!"

రాణి మల్లమ్మ ఈ మాటు గట్టిగా నవ్వేసింది. వెంకటలక్ష్మికి భయమేసింది. తను ఏదైనా పొరపాటు మాట్లాడిందా, తను స్థాయి మరిచి మాట్లాడిందా - ఏమో...

వెంకటలక్ష్మి ఒళ్ళంతా చెమటలు పడుతున్నాయి, మల్లమ్మ చేతిలో వరహాల మూట కదులుతోంది. అంటే, ఈ బాబుని డబ్బిస్తే కానీ కాపాడననే ఇంకా నమ్ముతోందా? - వెంకటలక్ష్మి ఒణికిపోయింది ఈ బొబ్బిలి ఉప్పు తిని పెరిగిన శరీరమిది తనకాపాటి విశ్వాసం లేదనే రాణిగారు భావిస్తోందా-

ఈ వరహాల మూట తనని అవమానరపరుస్తోంది - అమ్మగారికి తన మీద నమ్మకం లేదా! వెంకటలక్ష్మి వంచిన తల ఎత్తలేదు.

రాణి మల్లమ్మ లేచింది. వెంకటలక్ష్మికి ఏమీ తెలియటం లేదు. దబ్బిచ్చి పిల్లాడిని కాపాడమని రాజుగారే తనకి ఈమె చేత చెప్పిస్తున్నారా! వెంకటలక్ష్మి అలా చూస్తుండగారు మల్లమ్మ అంతఃపుర మందిరం వదిలి వెళ్ళిపోయింది.

రాజ్యంలో అందరూ ఆవేశంలో ఆవేదనతో వున్నారు. బొబ్బిలి కోట ముట్టడి నిజంగా జరిగితే కోటలోకి సిపాయిలు దూసుకు వచ్చేస్తే, ఈ ఆపద నుంచి స్త్రీలను ఎవరు కాపాడగలరు? ఊరంతా పెళ్ళి సందడిలో ఉండగా కోట ముట్టడి వార్తా!!

రంగరాయని ఆస్థానమంతా గంభీర సముద్రంలా వుంది దేవాలయం నుంచి వస్తున్న గుడి గంటలు ధ్వని ప్రతి గుండెనూ కదిలిస్తున్నాయి. మంత్రులు, సామంతులు, దండనాథులు, ఇంకా విభిన్నమైన ఆలోచనలలో పడి రాజుగారికి రాబోయే విపత్తును ఎలా ఎదుర్కోవాలో చెపుతున్నారు. పురోహితులు పంచాంగాలు చేయవలసిన శాంతి హోమాల గురించి ఆలోచిస్తున్నారు.

విజయరామరాజు బుస్సీ అండ దండలతో కోటలోకి విరుచుకుపడితే ఎవరెవరు ఏం చేయాలి - ఎలా కాపాడాలీ - ముఖ్యంగా రాజప్రాసాదాన్ని ఎలా దక్కించుకోవాలీ - ఆ స్థానంలో ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారు. -

ఎవరికీ ఏమీ పాలుపోవటం లేదు. రాజు రంగరాయలు ముఖాన గాంభీర్యం - కళ్ళలో ఎరుపు - తనని మోసం చేసి, బుస్సీతో కలిసి, కప్పం కట్టే లేఖ అందకుండా చేసిన విజయరామరాజుపై ప్రతీకారం తీర్చుకోవద్దా - రంగరాయలు గుప్పెళ్ళు బిగిసాయి. ఈ బొబ్బిలి కోటని తన రక్షించి తీరాలి!

రంగరాయలు దీర్ఘాలోచనలో వున్నాడు. మంత్రి, సామంత, దండనాథ, పురోహిత వర్గాలందరూ దీర్ఘాలోచనలో భృకుటి ముడిచి వున్నారు.

అంతలో, మంజీర రవళి రంగరాయల అంతరంగంలో కదిలింది. కంకణాల గల గల వీరారవంలా చెవిని సోకింది. రంగరాయలు చూపు తిప్పాడు. విభ్రాంతుడయ్యాడు. సభంతా అవాక్కపోయింది. భయంకరమైన నిశ్శబ్దం. ఒకరిముఖాలొకరు చూసుకుంటున్నారు. మంత్రి తన స్థానం నుంచి గబుక్కున లేచాడు తత్తరపాటుతో రంగరాయలు ముఖం తీక్షణమైంది. రాణి మల్లమ్మ దేవి రంగరాయల ఆస్థానంలో అడుగుపెట్టింది. ఏమీటివిచిత్రం. రాణివాసం వదిలి రాజ సభలోకా -రాజు ముఖంలో మారుతున్న భావాల్ని గమనిస్తూ ఎవరూ ఏమీ అనలేక నిశ్చేష్ఠులయిపోయారు.

రాణి మల్లమ్మ భర్త, రాజు అయిన రంగరాయలు దగ్గరకొచ్చింది.

రాజు కళ్ళలో నిప్పులు కురిశాయి.

"స్త్రీలు రాణివాసపు స్త్రీలు, ఆస్థానంలోకి వచ్చుటయా? ఇది ఎన్నడైనా కలదా? ఏమి సాహసమిది? ఏమి దురాచారమిది? ఘోషా ఏమైనది?"

రంగరాయలు రాణి మల్లమ్మ వైపు చూస్తూ, నిప్పులు చెరుగుతుంటే, ఇది రాజైన తనకి ఎంతటి అవమానమని మనసు ఉడికిపోతుంటే, ఏం చేయాలో తోచక అటు ఇటు చూసాడు రంగరాయలు.

సభ్యులు ముఖా ముఖాలు చూసుకుని లేచివెళ్ళిపోయారు.

రాణి మల్లమ్మ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బిగపట్టింది. కళ్ళలో అగ్నిగోళాలు, ముఖంలో కాళికమ్మవారు... అంతలో పెదాలపై మందహాసం!

"ఇంటికప్పు విరిగి పడుతుండగా ఇంకేమి ఘోషా! ఇంతకాలానికి ఆ పూసపాటి రాజు మనని రచ్చ కెక్కించాడుగా! పాలకొండకు వలసపోతే ఒక్కొక్క సిపాయికి ఒక్కొక్క వెలమ స్త్రీని కట్టడా విజయరామరాజు!? పరుల చేత చచ్చుట మాకేం పని?"

రాణి మల్లమ్మ భర్త రంగరాయల వంక చూసింది. ఆ చూపులు ఆ క్షణంలో రాజునే కాల్చేస్తాయన్నట్టున్నాయి.

"చచ్చిన మేము కోటలో చావలెను. పరులచేత చావము" - రాణి మల్లమ్మ గొంతు ఆ రాజసభ భవనమంతా ప్రతి ధ్వనించింది.

"మల్లమ్మా ఏమిటిది?" - రంగరాయలు రాణి చెయ్యి పట్టుకున్నాడు అంతే!

రంగరాయల్ని క్షణంలో రాజఠీవి, రాచరికం వెన్ను తట్టింది. ఒక ఆడది, ఒక రాణి సభలోకి రావటమా, వచ్చి... రంగరాయలు భృకుటి ముడిపడింది - స్త్రీకి ఇంత సాహసమా!!

"చచ్చిన మేము కోటలోనే చస్తాము, పరులచేత చావము" - రాణి మల్లమ్మ గొంతు మళ్ళా ఖంగు మంది.

"ఈ మాటలు చెప్పడానికి సభకి రావటమెందుకు? మా తమ్ముడితో చెప్పి పంపవచ్చు కదా" - రంగరాయలు గొంతులో కాఠిన్యం, దర్పం, రాజరికం, ఖంగున మోగాయి.

రాణి మల్లమ్మ క్షణంలో వెనుదిరిగి అంతఃపురానికొచ్చేసింది.

'ఈ మారు విజయరామరాజు మీద పగ తీర్చుకోవాలి' అనుకుంటూ రాణి మల్లమ్మ వెంకటలక్ష్మి వంక చూసింది.

"లక్ష్మి ఈ వరహాలమూట ఒళ్ళో పెట్టుకో. నువ్వు హాలు దాటగానే ఆ వేయి వరహాలు నేల మీద కుమ్మరించేయి. పసివాడితో పారిపో. సిపాయిలా, రౌతులూ ఆ వరహాలు ఏరుకునే లోపలే నీవు ఊరు పొలిమేరలు దాటిపో".

రాణి మాటలు పన్నీటి జల్లులైనాయి దాసికి. 'అమ్మగారిని తను ఎంత అపార్థం చేసుకొంది అనుకుంటూ పశ్చాత్తాపపడి, రాణి కాళ్ళ మీద పడింది వెంకటలక్ష్మి.

కోట ముట్టడి ప్రారంభమైంది. రాణి మల్లమ్మ స్త్రీలనందర్నీ పోగు చేసింది. ఇజార్లు, అంగీలు తొడిగి తల్వార్లు పుచ్చుకున్న స్త్రీలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నారు. శత్రుసేనలకి. రోకళ్ళతో, రాళ్ళతో, సైనికులు తలకాయలు బద్దలు కొడుతుంటే బుస్సీ వింతగా చూస్తున్నాడు. బొబ్బిలి పరాక్రమమేమిటో విజయరామరాజు వీరోత్సాహంతో కోటను కొల్లగొడుతున్నారు తన సైనికులని పొంగిపోతున్నాడు.

రంగరాయలుతో యుద్ధంలో ఎందరో నిలబడలేక వెనుదిరిగారు. విజయం మనకే అనుకుంటుంటే విజయరామరాజు సైన్యం విజృంభించింది. బుస్సీ వికృతమైన వికటాట్టహాసం రాణి మల్లమ్మ గుండెని తాకింది. రంగరాయలు ఆర్తనాదమేదో రాణి మల్లమ్మ గుండెలో దూసుకొచ్చింది.

రంగరాయలు నేలకూలాడనే వార్తతో రాణి మల్లమ్మ ఉగ్రకాళియైంది. ఆ క్షణమే నాయకురాలైంది. వీరావేశంతో ఊగిపోయింది.

"రండి, రండి" - రాణి మల్లమ్మ పిలుపుకి వీరోత్సాహంతో పరుగులు తీసి రాణిని సమీపించారు పెళ్ళికూతుళ్ళు, ఎందరో స్త్రీలు.

"విజయమో, వీర స్వర్గమో తేల్చుకోవాలంతే కానీ పరాయివాడికి లొంగిపోవటమా! రండి, ఇదే ఆఖరి చూపనుకోండి. భర్తలకి నమస్కరించి వారి చేతిలో వున్న కత్తిని అందుకోండి, రండి" రాణి మల్లమ్మ పిలుపు పెళ్ళిబొట్టుతో మెరిసే ఆ పెళ్ళికూతుళ్ళకి శంఖారావంలా వినిపించింది.

ప్రాణేశ్వరుల దగ్గర నుంచి బాకుల్ని అందుకున్నారు స్త్రీలు. కోటలోకి సైన్యం తోసుకొచ్చేసింది. వీరనారి మల్లమ్మ చుట్టూరా స్త్రీలు....యవ్వనం పొంగి పొర్లుతోన్న యువతులు...వయసు మీరిన వృద్ధురాండ్రు.

అప్పటికే, సిపాయిలు కోటలో చొరబడ్డారు. రెప్పపాటు మాత్రమే. రాణి మల్లమ్మ బాకుతో పొడుచుకు నేల వాలింది. స్త్రీలంతా పొడుచున్నారు. ఆ బొబ్బిలి కోట తల వంచుకుందా!

సిపాయి లెవర్ని నరుకుతారు? ఎవరిమానాల్ని అపహరిస్తారు? ఎవరి ప్రాణాల్ని తీస్తారు?

రాణివాసం అనంతవాయువుల్లో కలిసిపోయింది. బొబ్బిలి కోట కది విజయమా? పరాజయమా? ఎక్కడో రాణి మల్లమ్మ విజయరామరాజుని ప్రశ్నిస్తోందా అన్నట్లు వీరనారి గొంతు మారు మ్రోగుతున్నట్టే ఉంది వీధి వీధిన.

కాలిబూడిదైన, కోటలో పడివున్న శవాల్ని చూస్తూన్న బుస్సీ, విజయరామరాజు ముఖాలు వెలవెలబోయాయి. ఆత్మాహుతి చేసుకున్న నారీమణులు కంకణాల ధ్వనులు వారిద్దరి గుండెల్నీ కుదిపేశాయి. ఎవరు గెలిచారు? బొబ్బిలి కోట తల వంచుకున్నట్లనిపించింది. పీనుగు పెంటలు దాటుతూ కోట బయటకొచ్చాడు విజయరామరాజు.

వెంకటలక్ష్మి సామర్లకోట చేరింది. పసివాణ్ణి అప్పగించింది. పసివాడు వెంకటరాయలు గుప్పిట్లు నోట్లో పెట్టుకు కేరింతలు కొడుతూంటే "అమ్మ మాట నిలబెట్టాలి కన్నా చిన్నా" అంటూ కన్నీళ్ళు తుడుచుకుంది దాసి వెంకటలక్ష్మి, బొబ్బిలి కోటను తలుచుకుంటూ.

భొబ్బిలి కోటలో పీనుగులను బండిలో పడేస్తూ, " ఈ రాణివాసపోళ్ళు ఓనాడు బంగారు పల్లకీలో తిరిగినారే అయ్యో భగవంతుడా - రాణి మల్లమ్మని చచ్చి బతికించావులే" అనుకుంటూ వెట్టివాళ్ళు బండి తోసుకు బయటికెడుతుంటే సంధ్యా రుణిమతో భాస్కరుడు తల వంచి క్రుంగిపోయాడు పడమటి సముద్రంలో.

– రచన ఇంటింటి పత్రిక ఫిబ్రవరి, 2003